www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 మే 2025

చిత్రలేఖనంపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు

ది ఆర్టిస్ట్స్, పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, పాలకొల్లు వారి ఆధ్వర్యంలో కీర్తిశేషులు కోరుకొండ బాలకృష్ణ జ్ఞాపకార్థం, 2వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత చిత్రలేఖనం కార్యక్రమం జరిగింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని డ్రాయింగ్ నేర్చుకున్నారు. ఆదివారం పిల్లలకు అంతర్జాతీయ చిత్రకారులు మార్లపూడి ఉదయ్ కుమార్, ఎంఎంకెఎన్ఎం స్కూల్ డ్రాయింగ్ మాస్టర్ పి.వెంకటేశ్వర రావు మాస్టర్ చిత్రలేఖనంలో మెలకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వల్లూరి రామబ్రహ్మం, అధ్యక్షులు నీలం రవి, కార్యదర్శి సమతం చంద్రరావు, కోశాధికారి బొప్పే సాంబమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సోమాని శంకర్, సంఘ సీనియర్ సభ్యులు గోన్నాబత్తుల సత్యనారాయణ, కోరుకొండ సుబ్బారావు, తాళ్ల బాలసుబ్రహ్మణ్యం, ఎస్‌కెడి ఆర్ట్స్ బాబ్జి, కాసా కోటి వీరభద్రరావు పాల్గొన్నారు.

నిరీక్షణకు ఫలితమిదేనా..!

ఇళ్ల స్థలాల కోసం 39 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న ఎఎస్ఆర్.నగర్ వాసులు

స్థలాలివ్వకుండానే ఉన్న ఇళ్లను తొలగించేందుకు అధికారులు సిద్ధం

కోర్టును ఆశ్రయించిన 53 కుటుంబాలు

స్టే విధించి యథావిధిగా గృహాలు ఉంచాలని ఆదేశాలిచ్చిన కోర్టు

ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం శూన్యం

ఎఎస్ఆర్ నగర్‌లోనే నివాసం ఉంటాం : నివాసితులు

ప్రజాశక్తి - భీమవరం

వాళ్లంతా రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు. నివసించేందుకు జానెడు జాగా కూడా లేదు. ప్రభుత్వం స్థలం మంజూరు చేస్తుందేమోనని చూసినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్థలంలోనే నివాసాలు ఏర్పాటు చేసుకుని 39 ఏళ్ల నుంచి జీవనం సాగిస్తున్న ఆ నిరుపేద కుటుంబాల ఇళ్లను కాలువ్యం పేరుతో కూల్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో 53 కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. దీంతో కోర్టు ఆ గృహాలకు స్టే విధించి యథావిధిగా ఉంచాలని ఆదేశించింది. అయితే లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించుకున్న ఇళ్లు ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ఎఎస్ఆర్.నగర్ వాసులు భయం గుప్పెట్లో జీవనం గడుపుతున్నారు.

పాలకోడేరు ఎఎస్ఆర్.నగర్‌లో 39 ఏళ్ల నుంచి పేదలు నివసిస్తున్నారు. కేవలం కొద్ది మందికి మాత్రమే పట్టాలిచ్చారు. మిగిలిన వారికి రకరకాల కారణాలు చూపి మొండిచేయి చూపారు. సుమారు 108 కుటుంబాలు ఇక్కడే నివసిస్తున్నాయి. అయితే గత వైసిపి ప్రభుత్వం హయాంలో పాలకోడేరులో ఏర్పాటుచేసిన రెండు ప్రభుత్వ కాలనీల్లో 62 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. వాటిలో 9 పట్టాలకు సంబంధించి భూమి కోర్టు వివాదంలో ఉంది. మిగిలిన 53 మందికి అసలు ఇళ్ల పట్టాలు లేవు. అయితే నివాసాలు కూడా అరకొరగానే చేసుకున్నారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రభుత్వ లేఅవుట్‌లో కనీసం మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించలేదు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వంటి సౌకర్యాలు కూడా అంతంతమాత్రమే ఉన్నాయి. లేఅవుట్‌కు వెళ్లేందుకు ప్రధానంగా దారి సమస్య ఒకటి ఉంటే లేఅవుట్ మట్టి పూడిక నామమాత్రంగా చేసి వదిలేశారు. దీంతో చిన్నపాటి వర్షం వచ్చినా మోకాళ్లలోతు నీరుచేరి నడిచేందుకు దారి లేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇక్కడ నివాసం ఉంటున్న వారు ప్రభుత్వ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి మక్కువ చూప లేదు. దీనికి తోడు ఆర్థిక పరిస్థితులు సహకారం కూడా లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేదు. అయితే ఇదిలా ఉంటే 53 కుటుంబాలకు అసలు ఇళ్ల స్థలాలే లేవు. ఇంటి స్థలం కోసం అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా స్థలాలు మంజూరు కాలేదు. అధికారులను అడగ్గా అదిగో వస్తుంది. ఇదిగో వస్తుందని చెప్పడమే తప్ప ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు కేటాయించిన సందర్భంలో వీరందరికీ ఇళ్లు ఉన్నట్లు ఎఎస్ఆర్ నగర్లో నివాసం ఉంటున్నట్లు చూపించి ఇళ్ల స్థలాలు కేటాయించలేదు. అయితే ప్రస్తుతం రాజు కాలువ కలుషితం పేరుతో ఈ గట్టును ఆనుకుని నివసిస్తున్న పేదల ఇళ్లన్నీ తొలగింపు చర్యలు చేపట్టి 42 ఇళ్లను నిర్ధాక్షణ్యంగా కూల్చివేశారు. ఈ నేపథ్యంలో 53 కుటుంబాలు తమకు ఎటువంటి ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇవ్వలేదని, ఈ ఇంటిపైనే ఆధారపడి జీవిస్తున్నామని కోర్టును ఆశ్రయించాయి. దీంతో కోర్టు స్టే విధించి ఇళ్లను యథావిధిగా ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది. అసలు ప్రభుత్వం ఈ 53 కుటుంబాలకు ఎటువంటి స్థలాలు ఇవ్వకుండానే ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇళ్లను తొలగిస్తామని చెప్పడం నిరుపేదల కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇళ్ల స్థలాలు మంజూరు చేసే ముందు ఇళ్లు ఉన్నాయని చెప్పి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా ఇప్పుడు ఎటువంటి ఇళ్ల స్థలాలు లేకుండానే ఉన్న ఇంటిని కూల్చేస్తామని చెబుతుండడం ఎంతవరకూ సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇళ్లు తొలగిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

ఇల్లు ఉంది కదా స్థలం ఎందుకు అన్నారు..

జి.లక్ష్మి, నివాసితురాలు, ఎఎస్ఆర్.నగర్

నా భర్త సత్యనారాయణతో కలిసి ముగ్గురు పిల్లలతో 40 ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. రూపాయి రూపాయి కూడబెట్టి రూ.4 లక్షలు వెచ్చించి రేకుల షెడ్డువేసి ఇంటిని ఏర్పాటు చేసుకున్నాం. ఇళ్ల స్థలానికి దరఖాస్తు చేసుకుంటే నీకు ఇల్లు ఉంది కదా అని స్థలం రాదు అని అధికారులు చెప్పారు. ఇప్పుడున్న ఇంటిని తొలగిస్తామని చెబుతున్నారు. స్థలం ఇవ్వకుండా కట్టుకున్న ఇల్లు తొలగిస్తే ముగ్గురు పిల్లలతోఎక్కడికి వెళ్లాలి, ఎలా బతకాలి.

మూడు సార్లు కోర్టు స్టే తెచ్చుకున్నాం..

దొంగ నాగలక్ష్మి, నివాసితురాలు, ఎఎస్ఆర్.నగర్

నా భర్త నాగయ్య వ్యవసాయ కూలీ, మాకు ఇద్దరు పిల్లలు. మూడేళ్ల క్రితం రేకుల షెడ్డు నిర్మించుకున్నాం. ఇంటి కోసం చేసిన అప్పు ఇంకా తీరలేదు. ఇల్లు తొలగిస్తామని అధికారులు చెబితే మొదటిసారి కోర్టుకు వెళ్లాం. తొలగింపు కొన్ని రోజులు ఆగింది. మరోసారి అధికారులు నోటీసులు ఇచ్చారు. మళ్లీ మేము కోర్టుకు వెళ్లాం. ఇలా మూడుసార్లు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నాం. అయినా మా ఇంటిని కూడా కూల్చేస్తాం అని చెప్పడం ఎంతవరకూ సమంజసం.

ఎక్కడికి వెళ్లే ప్రసక్తే లేదు..

జోగి లక్ష్మి, నివాసితురాలు, ఎఎస్ఆర్.నగర్

40 ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. ఉన్నట్టుండి ఇల్లు తొలగిస్తాం మీరు వెళ్లిపోండి అంటే ఎక్కడికి వెళ్తాం. ఉన్న ఇంటిని వదిలి వెళ్లాలంటే కష్టంగా ఉంది. ఉన్నదంతా ఈ ఇంటి నిర్మాణానికి పెట్టాం. మాకు వేరేచోట స్థలం ఇస్తానన్నా వెళ్లే ప్రసక్తే లేదు. మేము ఎప్పటినుంచో ఇక్కడే ఉంటున్నాం. ఇక్కడే ఉంటాం. అన్యాయంగా ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోమంటే ఎక్కడికి వెళ్తాం.

ఇళ్ల స్థలానికి నాలుగు సార్లు దరఖాస్తు చేశాను..

గుత్తుల నాగమణి, నివాసితురాలు, ఎఎస్ఆర్.నగర్

రోజువారీ వ్యవసాయ కూలి పనులకు వెళ్లడం తప్ప వేరే ఆధారం మాకు లేదు. కూలి డబ్బులు కొంత మొత్తం దాచుకుని మిగతాది అప్పు చేసుకుని రూ.4 లక్షలతో రేకుల షెడ్డు నిర్మించుకున్నాం. గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో నాలుగు సార్లు ఇంటి స్థలానికి దరఖాస్తు పెట్టుకున్నాను. అయినా స్థలం మంజూరు చేయలేదు. ఎందుకు చేయలేదని అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. ఇంత దారుణంగా వ్యవహరిస్తారని అసలు గ్రహించలేదు.

ప్రశాంతంగా నీట్ పరీక్ష

97.5 శాతం విద్యార్థులు హాజరు

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జిల్లాలో నీట్ యూజీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, 97.5 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన రెండు నీట్ యూజీ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా ఏర్పాట్లు, విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, భద్రత, బందోబస్తు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. నిట్‌లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో 1,128 మంది హాజరు కావాల్సి ఉండగా 1,108 మంది, శశి ఇంజినీరింగ్ కళాశాలలో 758 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 739 మంది హాజరయ్యారు. మొత్తం 1,886 మంది హాజరు కావాల్సిన ఉండగా 1,847 మంది హాజరయ్యారని, 39 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేయడానికి జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి పర్యవేక్షించగా, ఇతర సభ్యులు డిఆర్‌ఒ, డిఇఒ, ఐబి డిప్యూటీ ఎస్‌పి, డిఐఇఒ పాల్గొన్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కతీబ్ కౌసర్ భానో, పరీక్షల కోఆర్డినేటర్ ఎన్.జయరామ్, తదితరులు ఉన్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

తనిఖీ చేస్తున్న అధికారులు

వర్షాన్ని సైతం లెక్కజేయని విద్యార్థులు

తాడేపల్లిగూడెంలోని నిట్, శశి ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు సెంటర్లో నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కజేయకుండా విద్యార్థులు పరీక్షకు తరలివచ్చారు. రెండు కళాశాలలో 4 సెంటర్ల ద్వారా 2,100 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంది. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరిశీలించి పరీక్షా కేంద్రాల్లోకి పోలీసు అధికారులు అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏ విధమైన ఆటంకాలు ఎదురవకుండా తాడేపల్లిగూడెం డిఎస్‌పి డి.విశ్వనాథ్ ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేసి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. శశి ఇంజినీరింగ్ కళాశాల వద్ద పట్టణ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, నిట్ కాలేజీ వద్ద ఎస్‌ఐలు నాగరాజు, జెవిఎన్ ప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని తేమశాతంతో సంబంధం లేకుండా కోనుగోలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం మల్లవరంలంక వెళ్లిన కౌలు రైతు సంఘం నేతలు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడారు. గాలి వానకు కల్లాల్లోని ధాన్యంతో పాటు కోత కోయని వరి పంట తీవ్రంగా దెబ్బతినే పరిస్థితి ఉందన్నారు. ఒక్కసారిగా వచ్చిన అకాల వర్షానికి జిల్లాలో ఎక్కడి ధాన్యం అక్కడే తడిసిపోయిందన్నారు. దీంతోపాటు ఈదురుగాలులకు వరి చేలు నేలకొరిగాయని తెలిపారు. తక్షణం ప్రభుత్వం గోనెసంచులిచ్చి, తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ పరిస్థితిని ఆసరా చేసుకుని మిల్లర్లు రైతులను దోపిడీ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంటనష్టం అంచనా వేసి కౌలు రైతులను, రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు, రైతులు కవురు శ్రీనివాసు, కవురు గోపాలకృష్ణ, జక్కంశెట్టి సుజాత, కవురు ఏడుకొండలు, కవురు గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం :తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నేతలు

అత్తిలి : ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

అత్తిలి : మండలంలో కురిసిన భారీ వర్షానికి స్కిన్నర్ పురం పంచాయతీ పరిధిలోని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ అన్నారు. పలు గ్రామాల్లో రైతులను కలుసుకునే సందర్భంగా స్కిన్నర్ పురం పంచాయతీ పరిధిలో పర్యటించారు. గోనెసంచులు లేక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే సంచుల కొరత లేకుండా వ్యవసాయ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తేమ శాతం సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని గోపాలన్ డిమాండ్ చేశారు.

అకాల వర్షం.. అపార నష్టం..!

అన్నదాతను కుదిపేసిన ఈదురుగాలులు, వర్షం

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

రెండు జిల్లాల్లో వరి రైతుల అవస్థలు

పలుచోట్ల తడిసి ముద్దయిన ధాన్యం

దాదాపు ఆరులక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాల్లోనే

మామిడి రైతులకు కోలుకోలేని దెబ్బ

అకాల వర్షాలకు ఏలూరు జిల్లాలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ ఆదివారం ఉదయం ఆకాల వర్షం, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. రైతులకు తీవ్ర కష్టాన్ని, నష్టాన్ని మిగల్చగా, రోడ్లపై నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలతో జనం నానా యాతయన పడ్డారు. ఏలూరు జిల్లాలో సరాసరి వర్షపాతం 25.4 మిల్లీమీటర్లు నమోదు కాగా, ముసునూరు మండలంలో అత్యధికంగా 66.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లింగపాలెం, ముదినేపల్లి, చాట్రాయి వంటి మండల్లాలోనే పెద్దఎత్తున వర్షం పడిన పరిస్థితి నెలకొంది. నడివేసవిలో వెంటాడిన అకాల ప్రకృతి వైపరీత్యంతో ముఖ్యంగా అన్నదాత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా రబీలో 3.92 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనావేయగా ఇప్పటివరకూ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం రెండు లక్షల టన్నుల వరకూ ఉంది. ఇంకా దాదాపు లక్షన్నర టన్నులకుపైగా ధాన్యం కల్లాల్లోనే ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేయగా ఇప్పటి వరకూ 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు జరిగింది. రెండు జిల్లాల్లోనూ దాదాపు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా రైతుల వద్ద కల్లాల్లోనే ఉన్న పరిస్థితి. టార్గెట్లు పూర్తయ్యాయంటూ వేగంగా ధాన్యం కొనుగోలు సాగకపోవడం వంటి కారణాలు సైతం ధాన్యం ఎక్కువగా కల్లాలో ఉండటానికి కారణంగా చెప్పొచ్చు. అకాల వర్షంతో కల్లాలో బస్తాలతో ఉన్న ధాన్యం సైతం తడిసి ముద్దయిన పరిస్థితి. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు పడ్డ ఇబ్బందులు వర్ణాతీతంగా మారాయి. వేగంగా ధాన్యం కొనుగోలు చేస్తే తప్ప రైతులకు కష్టాలు తీరే పరిస్థితి కనిపించడం లేదు.

ఉంగుటూరు మండలం తిమ్మయ్యపాలెంలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

మామిడి రైతులకు కోలుకోలేని దెబ్బ..

అకాల వర్షాలు, ఈదురుగాలులు మామిడి రైతును కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. ఏలూరు జిల్లాలో దాదాపు 50వేలకు పైగా ఎకరాల్లో మామిడిపంట సాగవుతోంది. రైతులు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టారు. పంట చివరిదశకు చేరిన తరుణంలో ఈదురుగాలులకు మామిడికాయలు రాలిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. అంతేకాకుండా వర్షాలకు బంగినపల్లితోపాటు ఇతర రకాల మామిడి పండ్లలో పురుగు చేరే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పొగాకు, మొక్కజొన్న రైతులు సైతం వర్షాలకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి.

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

భారీ వర్షాలు, ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఏలూరు నగరం, భీమడోలు మండలం గుండుగొలను, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, న్యూజివీడుతోపాటు పలుప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే అధికారులు స్పందించి జెసిబిల సాయంతో రోడ్లపై అడ్డుగా పడిన చెట్లను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చేశారు.

అకాల వర్షాలకు ఇద్దరు మృతి

ఈదురు గాలులు, భారీ వర్షానికి రేకుల షెడ్డుపై భారీ వక్షం కూలి పడడంతో ముసునూరు మండలం చెక్కపల్లిలో బాలుడు మృతి చెందాడు. చెక్కపల్లి గ్రామానికి చెందిన మామిళ్ల మారేశ్వరరావు బిసి ఏరియాలోని దెబ్బగూడెం వీధిలో చెరువు కట్టపై రేకుల షెడ్డులో ఉంటున్నాడు. ఈదురు గాలులకు ఇంటి పక్కన ఉన్న (ఎలగ చెట్టు) భారీ వృక్షం ఆ రేకుల షెడ్డుపై పడడంతో మారేశ్వరరావు కుమారుడు మామిళ్ల బాల గోవింద్(బాలుడు) ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. ఆ ఇంటి స్థలంలో వరండాలో ఉన్న తండ్రి మారేశ్వరరావు, తల్లి, ఇద్దరు అక్కలు క్షేమంగా బయటపడ్డారు. ఒక్కగానొక్క కొడుకు బాల గోవింద్ ఏడో తరగతి చదువుతున్నాడు. కళ్ల ఎదుటే కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరయ్యారు. అకాల వర్షం ఈదురుగాలులతో విద్యుత్ షాకుకు గురై దెందులూరు గ్రామంలోని పెద్ద దళితవాడకు చెందిన తానికొండ జార్జి మృతిచెందాడు. జార్జి తాపీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వర్షం రావడంతో పనికి వెళ్లలేదు. దీంతో ఇంటిముందు సర్వీస్ వైర్ గుమ్మం ముందు తెగిపడడంతో గుర్తించని జార్జి ఇంటి బయటకు రావడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. భార్య దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

పలు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

పంటనష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - వీరవాసరం

గాలివాన ప్రభావంతో పంటనష్టం కలిగిన ప్రాంతాలను తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు, వ్యవసాయ అధికారిని బిన్సీబాబు సోమవారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని అంచనా వేశారు. మండలంలో ఇంతవరకు 10 వేల ఎకరాలలో కోతలు పూర్తయినట్టు వారు తెలిపారు. 33,400 మెట్రిక్ టన్నులు టార్గెట్ ధాన్యాన్ని కొనుగోలు లక్ష్యం పెట్టుకోగా ఇంత వరకు 23,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇంకా 33,400 మెట్రిక్ టన్నుల ధాన్యానికి 8,36,000 గోనె సంచులు అవసరం అవుతుందని, అయితే ఇంతవరకు 7,92000 గోనెసంచులను దిగుమతి చేసుకోవడం జరిగిందన్నారు. ఈరోజు కురిసిన వర్షాలకు ధాన్యం రాశుల్ని కొంత వరకు టార్పాలిన్స్ సహాయంతో రైతులు కప్పి వుంచారని, కళ్లాల మీద 3,800 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా వుండాలని రైతులకు సూచించారు. మిల్లుల దగ్గర త్వరగా లోడ్లు దించేలా చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు.

ఆసక్తికరంగా వేసవి విజ్ఞాన తరగతులు

తాడేపల్లిగూడెం : పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వేసవి విజ్ఞాన తరగతులు స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గంథాలయంలో ఆసక్తికరంగా కొనసాగుతున్నాయని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. పలు సారాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి ప్రత్తి వీరాస్వామి విద్యార్థులకు పుస్తక పఠనం కథలు చెప్పారు. ఎ.జనార్ధన్ రావు దేశభక్తి, ఆధ్యాత్మిక గేయాలు నేర్పించారు. కొపెల్ల శ్రీనివాస్ అక్షరాస్యత, విజ్ఞానం, గౌరవ మర్యాదల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సెల్‌ఫోనుకు దూరంగా ఉండాలి, టివి ఎక్కువగా చూడకూడదని, ఎక్కువగా పుస్తకపఠనం చేస్తే మంచి విజ్ఞానవంతులు అవుతారని తెలిపారు. గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివారం వేసవి శిక్షణ తరగతులకు 30 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జరుగుతాయని, ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : చిత్రలేఖన రచనతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రముఖ కార్టూన్ వ్యంగ్య చిత్రకారులు ఎల్‌వి.సూర్యనారాయణ మూర్తి(ఎల్వి) అన్నారు. ఆదివారం మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా పిల్లలకు చిత్రలేఖనం, వ్యంగ్య చిత్ర లేఖనంల గురించి విశ్లేషణ చేసి వివరించారు. వ్యంగ్య చిత్రాలు వేయడానికి సమాజంలో విభిన్న వ్యక్తులను పరిశీలించి వారి ముఖాలు చిత్రించాలని సూచనలు చేశారు. ఈ శిక్షణలో టి.హసిని, కె.ఝాన్సీ, కె.తరుణ్, సిహెచ్.జ్యోత్స్న, అంజన దేవిశ్రీ, వి.సారిక, కె.సాయి స్యాదిప్తి, తనీషా, ఎస్.తనీష, డి.జశ్వంత్, అమరణ్ రెడ్డి, డి.జయంత్, గ్రంథాలయాధికారి పిటిఎస్.కుమార్, అసిస్టెంట్ రామిరెడ్డి, రామకృష్ణ సేవాసమితి, మానవతా సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురం : పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఈనెల 5వ తేది నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి కెజెఎస్ఎల్ కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులకు వివిధ రకాలైన పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెంచటం లక్ష్యంగా పేర్కొన్నారు. కథలు చెప్పుట, పుస్తక పఠనం, చిత్రలేఖనం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, చదవడం మాకిష్టం, పప్పెట్ మేకింగ్, చెస్ క్యారమ్స్, క్విజ్, జికె, డాన్స్, క్రాఫ్ట్, యోగ కమ్యూనికేషన్స్ స్కిల్స్ తదితర విజ్ఞాన సంబంధమైన తరగతులు నిర్వహించబడతాయన్నారు. అనుభవం గల రిసోర్స్ పర్సన్స్ రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించవలసిందిగా కోరారు. విజ్ఞాన శిక్షణ తరగతులలో ప్రతివారం నేర్చుకున్న అంశాలపై పోటీలు నిర్వహింబడతాయన్నారు. ఈ సంస్కృతి కార్యక్రమాలకు పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రధానంకు స్వచ్ఛంద సంస్థలు లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, వనిత క్లబ్ దాతలు సహకరించాలన్నారు. ఈ శిక్షణ తరగతులు విజయవంతం చేయాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ పండ త్రినాథ్, గ్రేడ్‌వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి కోరారు.

పెనుమంట్ర : చిత్రలేఖనం గురించి వివరిస్తున్న చిత్రకారులు ఎల్‌వి

ఘనంగా దాసరి జయంతి వేడుకలు

నివాళులర్పించిన మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో కీర్తిశేషులు దాసరి నారాయణరావు జయంతి వేడుకలు డాక్టర్ దాసరి కాంస్య విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగంలో దాసరి ఖ్యాతి ఉభయ తెలుగు రాష్ట్రాలకే కాకుండా దేశం నలుమూలలా వ్యాప్తిచెందిందని, 151 సినిమాలకు దర్శకత్వం వహించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సృష్టించిన ఏకైక దర్శకుడు మన దాసరి అన్నారు. సినీ దర్శకుడిగా, రచయితగా, నిర్మాతగా దాసరి సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. ఆయన తీసిన సినిమాలు మంచి సందేశంతో పాటు సమాజాన్ని చైతన్య పరిచాయని తెలిపారు. అందుకే దాసరి కాంస్య విగ్రహం ఏర్పాటు చేసుకుని వారిని భావితరాలతో పాటు భవిష్యత్ తరాలు గుర్తుండేలా నావంతు కృషిచేస్తానని మంత్రి అన్నారు. కార్యక్రమంలో దాసరి అభిమానులు, పురప్రముఖులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. వంగా నరసింహారావు, యర్రంశెట్టి వెంకటరత్నం, బోనం చిన బాబు,పెచ్చెట్టి బాబు, జీవి, కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, మండేల పణినాథ్, బళ్ల లక్ష్మణరావు, కొండ్రెడ్డి సూరిబాబు, రాయి సూరిబాబు, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, తాళబత్తుల వెంకటేశ్వరరావు, పి.నాగలింగేశ్వరరావు, గుడాలహరిబాబు పాల్గొన్నారు.

దాసరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి

రైతులతో మాట్లాడుతున్న జెసి

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వపరంగా కొనుగోలు చేస్తాం

జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - ఆచంట

అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వపరంగా కొనుగోలు చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. అకాల వర్షం కారణంగా తడిసిపోయిన ధాన్యం రాశులను ఆయన, నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వర్షం వల్ల తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, రైతులు అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోలు నిమిత్తం మండలంలో ఎక్కడా గోనెసంచుల కొరత లేకుండా ఏర్పాటు చేయడం జరిగిందని, తడిసిన ధాన్యాన్ని కూడా వెంటనే కొనుగోలు చేస్తామని ఆర్‌డిఒ దాసి రాజు తెలిపారు. మండలంలో దాళ్వా సాగు నిమిత్తం 10 వేల 100 ఎకరాలలో వరి పంట వేయడం జరిగిందని, ఇప్పటి వరకు 5 వేల 800 ఎకరాల్లో కోతలు పూర్తిచేయడం జరిగిందని తెలిపారు. వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు తెలిపారు. అకాల వర్షం వల్ల సుమారు 520 ఎకరాలలో వరిచేలు పాక్షికంగా నేలకొరగడం జరిగిందన్నారు. నేలకొరిగిన వరిచేలను రైతులు వెంటనే కట్టలుగా కట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ జి.కనకరావు, వీఆర్‌ఒలు, రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జిలు, రైతులు పాల్గొన్నారు.


కూలిన గోడను పరిశీలిస్తున్న నాయకులు

భారీ వర్షానికి కూలిన ఇంటి గోడ, స్లాబు

పరిశీలించిన సిపిఎం నాయకులు

తణుకు రూరల్ : మండలంలో ఆదివారం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి వేల్పూరు గ్రామంలో తాళ్ల స్వామి, కోటమ్మలకు చెందిన ఇంటి గోడ, కొంత స్లాబు భాగం కూలిపోయింది. అయితే సమయంలో వర్షం కురుస్తుండటంతో రోడ్డుపైన జనసంచారం లేదు. దీంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. సిపిఎం గ్రామ కార్యదర్శి ఐఖ్ చిన వీరభద్రరావు శాఖ కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజువారి కూలీ పనులు చేసుకుని జీవిస్తున్న తాళ్ల కోటమ్మ, తాళ్ల స్వామిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇల్లు పూర్తిగా ధ్వంసమై ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. స్థానిక వీఆర్‌ఒ, నాగరాజుకి ఫోను ద్వారా సమాచారం ఇవ్వగా ఆయన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి బాధిత కుటుంబాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పైఅధికారులకు సమాచారం తెలిపారు. ఈ పర్యటనలో తాడిశెట్టి కోటి వెంకటేశ్వరరావు, గణేష్, తిప్పా శివ పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న డిఆర్ఒ

భగీరధుని స్ఫూర్తితో లక్ష్యాన్ని చేధించాలి

డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు

భీమవరం : భగీరధుని స్ఫూర్తితో జీవితంలో అనుకున్నది సాధించవచ్చని డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కలెక్టరేట్లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన భగీరథ మహర్షి జయంతి వేడుకల కార్యక్రమంలో భగీరథ మహర్షి చిత్రపటానికి డిఆర్ఒ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపస్సుతో గంగను దివి నుంచి భువికి దించిన భగీరథుడు మహ తపస్వీ అన్నారు. పట్టుదలకు మారుపేరుగా నిలిచారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తే జీవితంలో ఏదైనా సాధించవచ్చన్నారు. భగీరథుడు మహా జ్ఞాని అని, దీక్షకు, సహనానికి ప్రతిరూపమన్నారు. ఎంత కష్టం అయినా లెక్కచేయకుండా అనుకున్నది సాధించే వారిని భగీరథ మహర్షితో పోలుస్తారని పేర్కొన్నారు. నేటి యువత లక్ష్యసాధనకు భగీరథ మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బిసి సంక్షేమ శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, బిసి సంక్షేమ శాఖ వసతిగృహం అధికారి సిహెచ్.మోహన్ రావు, కడలి శ్రీనివాస్, కెఎస్‌డి.ప్రసాద్, బి.లక్ష్మీ పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు : ఆర్‌డిఒ

నరసాపురం : నరసాపురం డివిజన్ పరిధిలోని అన్ని మండలాల పరిధిలోని రైతులు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ధాన్యం అమ్మకం గురించి ఆందోళన చెందవలసిన అవసరం లేదని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఇందుకు అవసరమైన సుమారు 11 లక్షల గోనెసంచులను ప్రభుత్వం ఇప్పటికే సిద్ధం చేసిందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించవలసిన అవసరం లేదు, అలాగే వర్షం కారణంగా ఆందోళన చెంది, మీరు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకుకు అమ్మవలసిన అవసరం లేదని, రైతులు గమనించాలని కోరారు.

బెల్ట్ షాపు నిర్వాహకుని అరెస్ట్

7 మద్యం సీసాల స్వాధీనం

పాలకొల్లు : పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆదివారం నిర్వహించిన దాడులలో ఆచంట మండలం, నీరుల్లిపాలెం గ్రామంలో పి.వసంతరావు అను వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్దనుంచి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు పి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ హెచ్చరించారు.

ఉండిలో చోరీ

11 కాసుల బంగారు, రూ.35 వేల నగదు అపహరణ

ఉండి : ఉండిలో తలుపులు వేసి ఉన్న ఇంట్లో దుండగులు చొరబడి 11 కాసుల బంగారం, రూ.35 వేల నగదు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి గ్రామానికి చెందిన శేషాద్రి వెంకట మధుసూదనరావు హైదరాబాద్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. తన కుమార్తె ఇంటి వద్ద ఉంటూ రాత్రి సమయంలో పక్కనే ఉన్న తన అన్న ఇంటికి వెళ్లి పడుకుంటోంది. అయితే ఆదివారం ఉదయం కుమార్తె ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగలగొట్టి ఉండడం గమనించి తండ్రికి తెలిపింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించామని ఎఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం యాత్రికులతో కలకలలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఎఒ మోక అరుణ్ కుమార్, చైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అల్లాడుతున్న ఆక్వా

మృత్యువాత పడుతున్న చేపలు, రొయ్యలు

లబోదిబోమంటున్న ఆక్వా రైతులు

ప్రాతళ్లమెరకలో హడావిడిగా రొయ్యలు పట్టుబడి

ప్రజాశక్తి - కాళ్ల

వాతావరణంలో ఒక్కసారిగా పలు మార్పులు సంభవించడంతో ఆక్వా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. చెరువుల్లో ఆక్సిజన్ అందక చేపలు అల్లాడుతున్నాయి. ఆకాశం మేఘావృతమై భారీ వర్షం పడుతుండడంతో చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ కొరతతో చేపలు, వనామీ రొయ్యలు మృత్యువాతపడడంతో ఆక్వా రైతులు నష్టాల పాలవుతున్నారు. 24 గంటలూ ఏరియేటర్లు తిపాల్సి వస్తోందని, దీంతో అధికభారం పడుతోందని రొయ్యల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో హడావిడిగా పట్టుబడులు చేస్తుండడంతో కనీస పెట్టుబడులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సాగు విస్తీర్ణం 1.40 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. వార్షిక టర్నోవరు రూ.18 వేల కోట్ల వ్యయం. ఒక్కసారిగా మారిపోయిన వాతావరణ ప్రభావం చేపలపై తాత్కాలికంగా పడగా వనామీ రొయ్యల మీద మాత్రం తీవ్ర పరిణామం చూపింది. చాలా వరకు రొయ్యలు మృత్యువాతకు గురవడంతో అర్థాంతరంగా చెరువులను పట్టాల్సి వచ్చింది. రొయ్యలు కౌంటు వచ్చి సాగు చివరి దశకు చేరిన వారు చెరువులు పట్టి, ఎంతో కొంత ఖర్చులు తెచ్చుకునే ప్రయత్నం చేశారు. కౌంటుకు రాని వారు మాత్రం పెట్టుబడి ఖర్చులు కూడా రావన్న ఉద్దేశ్యంతో చనిపోతున్న రొయ్యలను అలానే వదిలేశారు. వేసవి ఉష్ణోగ్రతల్లో అనుకూలంగా జరిగే వనామీ, చేపల సాగుకు ఆదివారం కురిసిన వర్షం దెబ్బ గట్టిగానే తగులుతోందని రైతులు లబోదిబోమంటున్నారు. మరో రెండు మూడు రోజులు ఇలానే వాతావరణంలో మార్పులు సంభవిస్తే మాత్రం ఆక్వాసాగు తుడుచుపెట్టుకుపోవటం ఖాయమని వాపోతున్నారు. పంటను కాపాడుకునేందుకు రైతులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

కలవపూడిలో నిరంతరాయంగా తిరుగుతున్న ఏరియేటర్లు

అదనపు వ్యయం

తిరుమాని మాత్రాజు, ఆక్వా రైతు, పల్లెపాలెం

వాతావరణంలో మార్పులు సంభవించినప్పుడల్లా ఆ ప్రభావం రైతులపై పడుతుంది. ఫలితంగా అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒక్కోసారి చేపలకు, రొయ్యలకు కూడా నష్టం వాటిల్లుతుంది. అసలే ఒక పక్క ఆక్వా ఉత్పత్తులకు సరైన ధర లేకపోవడం వల్ల నష్ట పోతున్నాం. వాతావరణం ప్రభావం ఏమేరకు ఉంటుందోనని భయపడుతున్నాం.

ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసంతో ఇబ్బంది

ముదుండి మణిబాబు, ఆక్వా రైతు, కలవపూడి

వాతావరణంలో ఒక్కసారిగా సంభవించే మార్పుల వల్ల తట్టుకోలేని పరిస్థితి ఏర్పడు తుంది. వేసవి కాలంలో వాతావరణానికి అలవాటు పడిన చేపలు, రొయ్యలు ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయి.

వర్ష బీభత్సం

పలుచోట్ల నేలకొరిగిన చెట్లు

విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం

కల్లాల్లో ధాన్యం ఒబ్బిడికి రైతులు పరుగులు

ఆచంట : ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో ఆదివారం ఉదయం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో దాళ్వా వరిపంట మాసూలు చేసుకుంటున్న రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం రాశులను హడావిడిగా పోగుచేసుకుని ప్లాస్టిక్ బరకాలతో మూసి వర్షం నీరు ధాన్యం రాశులను ముంచకుండా జాగ్రత్తలు పడ్డారు. ఈదురు గాలులకు తోడు ఉరుములు మెరుపులతో కుండపోత వర్షం కురవడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. మండలంలో ఇప్పటి వరకు 60 శాతం వరకు కోతల పూర్తి కాగా మరో 40 శాతం వరకు వరికోతలు సిద్ధంగా ఉన్నాయి. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో దాళ్వా వరిపంట మాసుళ్లు చేసుకుంటున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధాన్యం రాశులను హడావిడిగా పోగుచేసుకుని ప్లాస్టిక్ బరకాలతో మూసి వర్షం నీరు ధాన్యం రాశులను ముంచకుండా జాగ్రత్తలు పడ్డారు. ఆచంట కోడేరు, కొడమంచిలి, వల్లూరు, ఆచంట వేమవరం, గుమ్ములూరు రహదారిలో వందలాది ధాన్యం రాశులు ప్లాస్టిక్ బరకాలతో కప్పినప్పటికీ వర్షం నీటిలో తడవక తప్పని పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఈదురు గాలులకు ప్లాస్టిక్ బరకాలు ఎగిరిపోవడంతో ధాన్యం రాశుల్లోకి నీరు చేరిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం

నరసాపురంలో నేలకొరిగిన మామిడిచెట్టు

చేస్తున్నారు. ఒక్కసారిగా మారిన వాతావరణంతో రైతులు హడలెత్తిపోయారు. ఉదయం నుంచి వాతావరణం ఒక్కసారిగా మేఘాలు, మబ్బులతో వర్షం కురవడంతో రైతులు ఉరకలు, పరుగులు పెట్టారు. ఈ తరహాలో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడంలో రైతులు తనమునకలై ఉన్నారు. ఈ తరుణంలో భారీ వర్షం పడటంతో కష్టపడి పండించిన పంట కాపాడుకోవడానికి నానా తండాలు పెడుతున్నారు. రోడ్డుపైకి చేరిన ధాన్యాన్ని బరకాలతో కప్పి కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈదురుగాళ్లకు కొన్ని ప్రాంతాల్లో వరిచేలు నేలనంటాయి. మరో వారం రోజులపాటు వాతావరణం కరుణిస్తే గట్టెక్కుదామని రైతులు చెబుతున్నారు.

నీట మునిగిన ఆర్అండ్‌బి రహదారి

కుండపోత వర్షం కురవడంతో పలు డ్రెయిన్లు ముంపునకు గురికావడంతో మురుగునీరు ఆర్ అండ్ బి రోడ్డుపై ప్రవహించింది. దీంతో మార్టేరు, ఆచంట ప్రధాన రహదారి నీట మునిగింది. ముంపునకు గురైన రోడ్డుపై మురుగునీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. రాకపోకలకు ఆటంకం కలిగింది. దీంతో ట్రాఫిక్ జాం కావడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు

పాలకొల్లు : నేలకొరిగిన భారీవృక్షం

తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఆచంట రామేశ్వరస్వామి ఆలయం వెనుకనున్న భారీవృక్షం ఈదురు గాలులకు నేలకొరిగింది.

గణపవరం : మండలంలో తుఫానును తలపించిన గాలి, వర్షం వల్ల విద్యుత్ అంతరాయం కలిగింది. ఇప్పటికే ధాన్యం మాసూళ్ల పనులలో ఉన్న రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోడానికి వీలుగా కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించే పనులలో ఉండగా అకాల గాలి, వర్షంతో తమ పొలాలకు పరుగులు తీశారు. కురిసిన భారీ వర్షాలకు పంట నష్టాన్ని అంచనా వేయడానికి మండలాధికారులు గ్రామాలకు హడావిడిగా వెళ్లారు. గణపవరం బస్టాండ్‌లో రేకుల షెడ్డు రేకులు ఎగిరిపడ్డాయి. ఈ సంఘటనలో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవటంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ధాన్యం అమ్ముకొనే రోజులలో ఆకాల వర్షం వల్ల రైతుల పరిస్థితి ఆందోళనగా మారింది. ఆరుగాలం పండించిన మిల్లు యజమానులు సొమ్ములు కటింగ్ చేస్తున్నారని, వర్షం వల్ల తడిసిన ధాన్యం అసలుకొనరని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెనుమంట్ర : మండలంలో ఒక్కసారిగా ఆకాశంలో మార్పులు వచ్చి ఉరుములు, మెరుపులతో, ఈదురు గాలులతో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వర్షం ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, మురుగు కాల్వలు పూర్తిగా మునిగిపోయాయి. అక్కడక్కడా పొలాల్లో పంట కోత పూర్తయి పనల మీద ఉన్న ధాన్యం కంకులు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. రోడ్డు మీద బరకాలు కప్పి ఉంచిన ధాన్యం కుప్పలు కొంతమేర వర్షానికి తడవడంతో రైతులు వాపోయారు.

వీరవాసరం : మండలంలోని పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం గాలి వాన బీభత్సం సృష్టించింది. తీవ్రమైన సుడిగాలి, పిడుగులు దాటికి వర్షం తోడవడంతో పరిస్థితులు ఒక్కసారిగా భయాందోళనకు గురిచేశాయి. అకస్మాత్తుగా వాతావరణం మార్పు చెందడంతో పొలాల్లో ఉన్న ధాన్యాన్ని తడవకుండా రక్షించుకునేందుకు రైతులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో మండలంలో అనేక చోట్ల ధాన్యం తడిసిపోయింది. వేసవి పంట కావడంతో ధాన్యాన్ని గట్లపై బరకాలు కప్పి ఉంచారు. విపరీతమైన గాలికి ధాన్యం పైనున్న బరకాలు ఎగిరిపోవడంతో వర్షానికి ధాన్యం తడిసిపోయింది. ధాన్యాన్ని గట్టుకు చేర్చి వారం రోజులు కావస్తుందని, అధికారులు సకాలంలో సంచులు

గణపవరంలో రోడ్డుపై అడ్డంగా పడిన వృక్షం

ఇవ్వని కారణంగా ఆరు ఎకరాల ధాన్యం తడిసిపోయిందని రైతు రెడ్డి పెద్ద సన్యాసిరావు వాపోయాడు. రహదారులపై భారీ వృక్షాలు కుక్కటివేళ్లతో పడిపోయాయి. ఈదురుగాలకు పచ్చి కొబ్బరి ఆకులు సైతం రహదారులపై చెల్లాచెదురుగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వీరవాసరం వమేటేపూడి మార్గంలో ఒక వృక్షం దారికి అడ్డంగా పడిపోవడంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఈదురుగాలుల బీభత్సంతో కరెంటు తీగలపై చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఉదయం నుంచి కరెంటు లేక ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు చేర్చే విధంగా అధికార యంత్రాంగం స్పందించాలని రైతులు కోరుతున్నారు. పంచాయతీ పరిధి తలతాడు తిప్పలు గుడాల కోట సత్యనారాయణ గేదె పిడుగుపాటుకు మృతిచెందింది. దీని విలువ సుమారు లక్ష రూపాయల విలువ చేస్తుందని రైతు తెలిపాడు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పట్టణంలో ఆదివారం ఉదయం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైంది. కారు మబ్బులతో చీకటి కమ్ముకుంది. అనంతరం

పెనుగొండ : కాలువలను తలపిస్తున్న రోడ్లు

ఈదురుగాలులతో ఒక్కసారిగా ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రహదారులు తడిసి ముద్దయ్యాయి. వల్లపు ప్రాంతంలోని డ్రెయినేజీలు పొంగి వర్షపు నీరు రోడ్లమీదకు చేరుకుంది. ఉదయం 9:30 నుంచి సుమారుగా రెండు గంటల పాటు వర్షం కురిసింది. దీంతో వారం పది రోజులుగా ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వర్షానికి సేద తీరారు. సుమారు గంటన్నర పాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

పెనుగొండ : దాళ్వాసాగు పూర్తయి ధాన్యం చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కోసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని రైతులు కోరుకుంటున్నారు. వర్షం కురిస్తే పెనుగొండ డ్రెయిన్లు నిండి పొర్లుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు కోరుకుంటున్నారు.

ఉండి : భారీ వర్షానికి చెట్లు, కరెంటు, స్తంభాలు, సెల్ టవర్ నేలకూలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వాంద్రం, ఎన్ఆర్‌పి అగ్రహారం, పెదపుల్లేరు, ఉండి తదితర గ్రామాల్లో కరెంటు స్తంభాలు పడిపోయి విద్యుత్ వైర్లు తెగిపోవడంతో ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో సెల్ ఫోన్స్ సిగ్నల్స్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చిరు వ్యాపారస్తులు, పాల వ్యాపారులు వ్యాపారాలు లేక సరుకు పాడైపోయి ఇబ్బందులు పడ్డారు. వాంద్రంలో డ్వాక్రా భవనంపై బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేయడంతో ఈదురు గాలులకు బిఎస్ఎన్ఎల్ టవర్ కూలిపోయి పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పక్కనే అంగన్వాడీ కేంద్రం ఉండగా బిఎస్ఎన్ఎల్ టవర్‌కు ఏవిధంగా అనుమతి ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా టవర్‌ను

ఆకివీడులో రోడ్లపైకి చేరిన వర్షపు నీరు

మొగల్తూరులో నేలకొరిగిన వరిపైరు

అక్కడి నుంచి తరలించాలని పలువురు కోరుతున్నారు.

ఆకివీడు : మండలంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈ గాలివానతో రైతులకు తీవ్ర నష్టం కలిగింది. ఉదయం ఎనిమిది గంటలకే మొదలైన వాన ఒక్కసారిగా ఇసుక తుఫానులా లేచింది. ఆక్రమంలోనే అక్కడక్కడా చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు దిగిపోయాయి. 10 గంటల సమయానికి కుంభవృష్టిగా మారింది. సుమారు రెండున్నర గంటల పాటు ఏకధాటిగా భారీ స్థాయిలో గాలి, వాన కురిసింది. ఒక దశలో భయానక వాతావరణం ఏర్పడింది. పిడుగులు సైతం పడ్డాయి. ఈ వానలకి పల్లపు ప్రాంతాలు మొత్తం జలమయమయ్యాయి. అక్కడక్కడా రాశులు తడిసాయి. చేపల, రొయ్యల చెరువుల్లో చేపలు, రొయ్యలు పైకి తేలిపోయాయి. ఈ అకాల వర్షానికి అనుకోని నష్టం వాటిల్లింది.

మొగల్తూరు : భారీ ఈదురుగాలు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీగా వీచిన గాలులకు మామిడికాయలు నేలరాలాయి. మండలంలోని మొగల్తూరు, ముత్యాలపల్లి, రామన్నపాలెం, కేపీపాలెం, పేరుపాలెం తదితర గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. గాలుల ప్రభావంతో మామిడికాయలు భారీగా నేలరాలయి. దీంతో మామిడి తోటలను కౌలుకు తీసుకున్న

వీరవాసరంలో ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

రైతులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాల ప్రభావంతో కాయలకు తెగులు సోకే ప్రభావం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాళ్వాలో సుమారు 4 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇటీవల చేలు తయారయ్యి పంట చేతికి అందే పరిస్థితులలో అకాల వర్షం సంభవించింది. దీంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 15 వేల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షానికి చెరువుల్లో ఆక్సిజన్ శాతం తగ్గిపోయింది. దీంతోపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఏరియేటర్‌లు కూడా పనిచేయలేదు. ఆక్వా రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఇటుక బట్టీలు : అకాల వర్షం ప్రభావంతో బడుగులపై ఉన్న ఇటుకలు తడిసి ముద్దయ్యాయి. పలువురు యజమానులు ఇటుకలపై బరకాలు కప్పి తడవకుండా ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ వర్షంతో వేళల్లో నష్టం వాటిళ్లుతుందని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొగల్తూరు నుంచి కోటమీదుగా సేరేపాలెం వెళ్లే రహదారి,

ఉండి : నేలకొరిగిన చెట్లు , తెగిన విద్యుత్ వైర్లు

మొగల్తూరు నుంచి కొత్తపాలెం మీదుగా వెంపవెళ్లే ఆర్ అండ్ బి రహదారి, రామన్నపాలెంలోని రహదారులు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం ప్రభావంతో ఆ గుంతల్లో మోకాళ్లలోతు నీరు నిలిచింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు : మండలంలోని కొత్తట, కాళీపట్నం, పేరుపాలెం, కేపీపాలెం తదితర గ్రామాల్లో విద్యుత్ వైర్లపై చెట్లు విరిగిపడడంతో అవి తెగిపడ్డాయి. స్తంభాలు నేలకు ఒరిగాయి. దీంతో మండలం అంతా విద్యుత్ సరఫరా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు పలుచోట్ల మరమ్మతులు చేసి పలు గ్రామాల్లో సాయంత్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

నరసాపురం : నరసాపురం పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షానికి మామిడి, ఉప్పు, వరి రైతులు నష్టపోయారు. తీరంలోని పెదమైనవాని లంక గ్రామంలో చేతికి వచ్చిన ఉప్పు పంట కరిగిపోయింది. ఈదురుగాలులకు మామిడికాయలు రాలిపోయాయి. కొప్పర్రు గ్రామం నుంచి మల్లవరం మార్గంలో చెట్లు నేలకొరిగాయి. మండలంలోని ఎల్‌బి.చర్ల, యర్రంశెట్టివారి పాలెం, సీతారామపురం గ్రామాల్లోన్ని బీర, బెండ, దోస, ఆనప పాదులు నీట మునిగాయి.

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి

జిల్లాలో కొబ్బరి ప్రధాన పంట

మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు : గోదావరి జిల్లాల్లో వరి, ఆక్వాతో పాటు కొబ్బరి ప్రధాన పంటగా ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు కోకోనట్ మర్చెంట్స్ అసోసియేషన్ 58వ వార్షికోత్సవం సందర్భంగా నూతన పాలకవర్గంతో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. సంఘ నూతన అధ్యక్షుడిగా కటారి నాగేంద్ర కుమార్, కార్యదర్శిగా ఇనుకొండ తాతాజీ, కోశాధికారిగా మాటూరి రామ్ కుమార్‌లు ఎన్నికైన సందర్భంగా మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. కొబ్బరి వ్యాపారులకు ఏ సమస్య వచ్చినా తాను పరిష్కరించడానికి ముందుంటానని మంత్రి చెప్పారు. కొబ్బరికి గిట్టుబాటు ధర లేక రైతులు భాదపడుతున్నారని అన్నారు. గతంలో టిడిపి హయాంలో సిఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి యనమల దృష్టికి తీసికెళ్లి తనవంతు సహాయం చేసానని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో చాంబర్స్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు, ఎఎంసి చైర్మన్‌గా ఎన్నికైన కోడి విజయభాస్కర్, మాటూరి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ సేవలు

పెనుమంట్ర : మండలంలోని 18 గ్రామాల్లోని సచివాలయాల వారీగా ఈనెల 5వ తేదీ సోమవారం నుంచి 15వ తేదీ గురువారం వరకు మొబైల్ ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఎంపిడిఒ పి.సామ్యూల్ ఇక్కడ తెలిపారు. ఈమేరకు క్యాంపులు 5, 6 తేదీల్లో జుత్తిగ, భట్ల మగటూరు, ఓడూరు గ్రామాల్లో, 7, 8 తేదీల్లో నత్తా రామేశ్వరం, వెలగలవారిపాలెం, సత్యవరం గ్రామాల్లో, 12, 13 తేదీల్లో మాముడూరు, మల్లేశ్వరం, వెలగలేరు గ్రామాల్లో, 14, 15 తేదీల్లో పొలమూరు, సోమరాజు ఇల్లింద్రపర్రు, నెగ్గిపూడి గ్రామాల్లో జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. జీరో నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు సైతం ఆధార్ నమోదు చేయించాలని, ఇందుకోసం గ్రామాల్లోని అంగన్వాడీ కార్యకర్తలను సంప్రదించి, మొబైల్ ఆధార్ సేవలు పొందాలని అన్నారు.

పంట కాలువలోకి డ్రెయినేజీ నీరు

ఉండి : ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి ఉండి మండలం ఎండగండి వద్ద పంట కాలువ కింద నుంచి వెళ్తున్న మీడియం డ్రెయినేజీకి కన్నం పడడంతో ఊబికి నీళ్లు పంట కాలువలోకి వెళ్తున్నాయని పలువురు ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని నివారణా చర్యలను చేపట్టారు

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

గురుకుల ప్రవేశ పరీక్షకు 94 మంది విద్యార్థులు హాజరు

నరసాపురం : గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సీట్ల భర్తీ కోసం లక్ష్మణేశ్వరం నక్కావారిపేటలోని బిసి గురుకుల పాఠశాలలో ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పరీక్షల్లో 224 విద్యార్థులు పాల్గొనాల్సి ఉండగా 94 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 190 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ కె.శైలజ తెలిపారు.

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

O.S. No. 882/2024

Between:

సాగి వెంకట సత్యనారాయణ వర్మ -వాది

మరియు

గుండుగొంటి శ్యామలరావు -ప్రతివాది

To:

గుండుగొంటి శ్యామలరావు, తండ్రి: రామస్వామి, ఇంటి నెం. 11-115/2, హరిజనపేట, చింతలపూడి - 534460, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 17-06-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

చిత్తలూరి వెంకట సుబ్బారావు

కాకినాడ న్యాయవాది, కాకినాడ-533005

30-4-2025 సెల్: 9948519236

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) భీమవరం వారి కోర్టులో

O.S.No. 386/2024

Between:

వాది:- మెంటే వెంకట స్వామి

Vs

ప్రతివాది:- సరాబు లోక రక్షకుడు అనే లోక సాక్షుడు

ప్రతివాది:

సరాబు లోక రక్షకుడు అనే లోక సాక్షుడు, S/o. సుబ్బారావు, Water Tank Opposite, పెద అమిరం, కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో అనేక పర్యాయములు ప్రతివాదికి శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినప్పటికీ అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము పై ప్రతివాది **ది. 18-06-2025వ సం॥ తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. అట్లు కాని ఎడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమందు తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది.

(By Order)

కూనపరాజు గోపాలకృష్ణంరాజు

వాది తరపు అడ్వకేట్, శ్రీరామపురం, భీమవరం

భీమవరం ది.04-05-2025